అంపశయ్యపై గిరిజన బిడ్డలు

- పెంబి మండలంలో ఏడు నెలల్లో ఆరుగురి ఆత్మహత్య
- గిరిజనుల అభివృద్ధిపై ప్రభుత్వం పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనం

పెంబి, ఆగస్టు 4: నిర్మల్ జిల్లా పెంబి మండలంలో ఎక్కువ మంది గిరిజన ప్రజలు నివసిస్తున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోడమో. ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడమే గానీ గిరిజన బిడ్డలు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం పెంబి మండలంపై ప్రత్యేక దృష్టి సారించి గిరిజన ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏడు నెలల్లో నేటి వరకు పెంబి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో ముగ్గురు రైతులు, ఇద్దరు విద్యార్థులు, ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. మొత్తం గిరిజనులే చనిపోవడం గమనార్హం. జనవరి 13న తాటిగూడ గ్రామానికి చెందిన రైతు గుగ్లావత్ శ్రీకాంత్, జనవరి 24న రైతు గుగ్లావత్ గోవింద్, జూలై 2 న యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు ఆర్క సంతోష్, జూలై 21న రాజురా గ్రామానికి చెందిన విద్యార్థి మాలవత్ మహేశ్, జూలై 29న జంగన్‌గూడ గ్రామానికి చెందిన కనక శేఖర్, ఆగస్టు 3న బుర్కలేకని గ్రామానికి చెందిన విద్యార్థి నైతం దత్తురాం ఆత్మహత్య చేసుకున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఖానాపూర్ రూరల్, ఆగస్టు 4 : ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ శివారులో ఓ యువకుడు కుటుంబ కలహాలతో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ లింబాద్రి పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖానాపూర్ పట్టణంలోని పద్మవతి నగర్‌కు చెందిన లోకిని శివకుమార్ (32)గత 3 నెలల క్రితం మలేషియా దేశం నుంచి తిరిగి వచ్చారు. గత కొన్ని రోజులుగా ఇంట్లో తరుచుగా సమస్యలు ఎర్పడటంతో మనస్తాపం చెందడాన్నారు. శివకుమార్ తమ్ముడు రాకేశ్ ప్రతి రోజూ మద్యం సేవిస్తూ చెప్పిన మాటలు వినక జూలాయిగా తిరగడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు.

బాసరలో గుర్తు తెలియని మృతదేహాలు

బాసర, ఆగస్టు 4 : బాసర గోదావరి నదిలో వేర్వేరు ఘటనల్లో రెండు మృతదేహాలు లభ్యమైనట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. వేర్వేరు ఘటనల్లో ఆత్మహత్య చేసుకున్న వీరిద్దరినీ గజ ఈత గాళ్ల సాయంతో వెలికి తీసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వివరాలు తెలిస్తే బాసర పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

యామినీ కృష్ణమూర్తికి చిన్నారుల శ్రద్ధాంజలి

ఎదులాపురం, ఆగస్టు 4 : యామినీ కృష్ణమూర్తికి చిన్నారుల శ్రద్ధాంజలి దిగ్గజ భరత నాట్య, కూచిపూడి కళాకారిని యామినీ కృష్ణమూర్తి మృతి చెందడంతో జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో ఆమె చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె ఎందరో మందికి నృత్యంలో శిక్షణ ఇచ్చారని, ఆమె నుంచి స్ఫూర్తి పొందుతామని బాలకేంద్రం పరిరక్షకుడు, జాతీయస్థాయి నృత్య కళాకారుడు మిట్టు రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకేంద్రం తల్లిదండ్రుల సంఘం సభ్యులు, పోషకులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా సదస్సులో జిల్లా నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఆగస్టు 5: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న జాతీయ విద్యా సదస్సులో జిల్లా నాయకురాలు ఎస్టీఎఫ్ఐ జనరల్ కౌన్సిల్ సభ్యులు వైద్య శాంతి కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్లమెంటు సభ్యుడు అమరారం ఎస్సీ ఎస్ఐ నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. నూతన విద్యా విధానం పేరిట విద్యా ప్రైవేటీకరణ సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న విద్యా విధాన వ్యతిరేక పోరాటం నూతన భవనం నుంచే ప్రారంభించాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ పేదలకు విద్య అందాలంటే విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. ఆన్‌లైన్ విధానంలో విద్య కేవలం కార్పొరేట్లకు మాత్రమే అందుతుందని, గ్రామీణ పేదలకు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ రాష్ట్ర జాతీయ ఉపాధ్యక్షుడు చావా రవి, సభ్యులు దుర్గ భవానీ, జనరల్ కౌన్సిల్ సభ్యుడు జంగయ్య పాల్గొన్నారు.

ఆదివాసీ గూడేల్లో ఖొడంగ్ సందడి

నార్నూర్, ఆగస్టు 4 : ఆదివాసీ గూడేల్లో చుక్కల ఆమవాస్యను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీలు అటవీ ప్రాంతంలోని పొలిమెరలో వనదేవతకు సంప్రదాయ పూజలు చేశారు. వెదురు కర్రలను వెంట తీసుకొచ్చారు. ఇంటి వద్ద వెదురుతో ఖొడంగ్ తయారు చేశారు. వర్షాకాలంలో చిన్నపెద్ద లు బురదల్లో ఖొడంగ్‌లపై నడవడంతో వ్యాధులు దరిచేరవని ఆదివాసీల నమ్మకం. నెల పాటు చిన్నపెద్ద తేడా లేకుండా ఖొడంగ్‌లపై నడుస్తుంటారు. చిన్న పిల్లలు ఆటల పోటీలు కూడా నిర్వహిస్తుంటారు. పొలాల అమవాస్య మరుసాటి రోజు(బొడుగ)వరకు వాటిపై నడుస్తుంటామని గ్రామపెద్దలు తెలిపారు.

మాన్కాపూర్‌లో వెదురు కర్రతో ఖొడంగ్ తయారు చేస్తున్న గిరిజనులు

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్ బాబు

మాట్లాడుతున్న భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్ బాబు

భైంసా, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్ బాబు అన్నారు. పట్టణంలోని బుద్ధవిహార్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేపట్టినప్పుడు ఇదే సుప్రీం కోర్టు వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చి మళ్లీ ఇదే సుప్రీం కోర్టు వర్గీకరణ సమర్థిస్తూ తీర్పు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. వెంటనే ఈ తీర్పును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో మాజీ కౌన్సిలర్ గంగాధర్ దగ్దే, గౌర శ్రీనివాస్, విఠల్ కాంబ్లే, చాకేటి లస్మన్న, దిగంబర్ సాయినాథ్, తదితరులు ఉన్నారు.

ఈ నెల 8న జంతర్‌మంతర్ వద్ద ధర్నా

మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్, ఆగస్టు 4 : ఈ నెల 8 నుంచి జంతర్ మంతర్ వద్ద రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించనున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కులాల జేఏసీ నాయకులు బొకంటి సుభాష్, ప్రజ్ఞాశీల్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం తీర్పును సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జనాభా గణన లేకుండా ఎస్సీ వర్గీకరణ పూనుకుంటామని ప్రకటించడం సరికాదన్నారు. ఆర్టికల్ 340, 341 ప్రకారం క్యాబినెట్‌కు గాని, రాష్ట్రపతికి మాత్రమే వర్గీకరణ చేసే అవకాశం ఉందని మరిచిపోయి ప్రభుత్వాల, ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాయన్నారు. ఈ నెల 21న భారత్ బంద్ విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కోడి బలవంత్, దూట మహేందర్, గణేశ్, నారాయణ, ఆకాశ్, దుర్గయ్య, జాడి మల్లేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

కుభీర్, ఆగస్టు 4 : ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో ముప్పై ఏళ్ల పోరాటానికి సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో మాదిగలకు ఆత్మగౌరవం కల్పించినట్లయిందని మాదిగ నాయకుడు బీఆర్ఎస్ మండల నాయకుడు గోరేకర్ కాశీనాథ్ అభిప్రాయ పడ్డారు. ఆదివారం ఆయన మండల కేంద్రం కుభీర్‌లో మాట్లాడుతూ కేసీఆర్ హయాంలోనే వర్గీకరణకు బీజం పడిందని బీఆర్ఎస్ ప్రభుత్వం వర్గీకరణకు అడ్డు చెప్పలేదని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణకై చేసిన ఉద్యమం చారిత్రాత్మకమైనదని పోరాడిన ఎందరో మాదిగ నాయకులు ఎందరో భౌతికంగా లేకపోయినా వారి త్యాగాలు మాదిగ సమాజం మరిచి పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాదిగ నాయకులు ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ఎదులాపురం, ఆగస్టు 4: ఆదిలాబాద్‌లోని తాటిగూడ పాఠశాల వద్ద రాణిదివ్య నగర్‌కు చెందిన జహీర్ గంజాయి విక్రయిస్తున్న సమయంలో పట్టుకున్నామని టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు. అతని వద్ద నుంచి 80 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి ప్యాకెట్లను కిన్వాట్ నుంచి కొనుగోలు చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దిలావర్‌పూర్, ఆగస్టు 4: నిర్మల్ భైంసా 61వ జాతీయ రహదారిపై లోలం మూలమలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. దిలావర్‌పూర్ ఎస్ఐ రాజేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాడెగాం గ్రామానికి చెందిన హన్మంతురావు (50)బైక్‌పై సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామానికి వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి వస్తున్నాడు. లోలం, బీరవెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద నిర్మల్ నుంచి భైంసాకు అతి వేగంగా వెళ్తున్న బోలేరో వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న హన్మంతురావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నిర్మల్ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపినారు.

ఇసుక లారీ పట్టివేత

వాంకిడి, ఆగస్టు 4: మండలంలోని కనర్‌గాం నుంచి మహారాష్ట్రకి(ఎంమ్ హెచ్ 34 బీజెడ్ 3730)నంబర్ గల డీసీఎం వాహనంలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ఖమాన ఎక్స్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. నిందితుడు మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాకు చెందిన డ్రైవర్ శ్యామ్ రావు జండేకర్‌ను అదుపులో తీసుకొని లారీ, నిందుతున్ని వాంకిడి పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ దాడుల్లో ఎస్ఐ గంగన్న,కానిస్టేబుల్ సంజీవ్ తదితరులున్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కేజీబీవీ విద్యార్థులకు గోల్డ్ మెడల్

ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న విద్యార్థులు

ఖానాపూర్ రూరల్, ఆగస్టు 4 : నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో మస్కాపూర్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా అక్కడి నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా కీర్తన, మల్లీశ్వరి, శాంతిప్రియలు గోల్డ్ మెడల్ అందుకున్నారు. మాస్టర్ ఆరిఫ్ ఖాన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

కిసాన్ టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలి

రైతులతో మాట్లాడుతున్న కుమ్ర వినాయక్

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 4: రైతులు కిసాన్ టోల్ ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని కిసాన్ మిత్ర డివిజన్ కో ఆర్డినేటర్ కుమ్ర వినాయక్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని కుమ్మరి కుంట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువు కొనేటప్పుడు తప్పకుండా రసీదు తీసుకోవాలని అన్నారు. భూమి రికార్డులు, పంట రుణాలు, కౌలు రైతుల సమస్యలు, విత్తనాలు, పంట బీమా, మార్కెట్ యార్డులు, ధరలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టం కలిగినప్పుడు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలకోసం కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ టోల్‌ఫ్రీ 9490900800 నంబర్‌ను సంప్రదించి మీ సమస్యలను తెలియజేయాలన్నారు. సమస్యలను జిల్లా, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

హాస్టల్ వార్డెన్‌గా బోగ శ్రీనివాస్

తాంసి, ఆగస్టు 4 : కప్పర్ల గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్‌గా బోగ శ్రీనివాస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వార్డెన్‌గా పని చేస్తున్న సురేందర్ తాంసికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది దేవ్‌బాయి, పులి సృజన్, తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో చౌడేశ్వరి మాత ఆవిర్భావ దినోత్సవం

ఎదులాపురం, ఆగస్టు 4 : జిల్లా కేంద్రంలో ఆదివారం చౌడేశ్వరి మాత ఆవిర్భావ దినోత్సవాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు సుందరకాండ పారాయణం పఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రుణానికి బీమా రక్ష

గృహ రుణం అంటే దీర్ఘకాల అప్పు. దీన్ని చెల్లించేటప్పుడు అనేక ఒడిదొడుకులు సహజం. అందుకే ఈ రుణానికి బీమా రక్షణ ఇవ్వడం తెలివైన పని అనిపించుకుంటుంది. అప్పుడే మనకు, మన కుటుంబ సభ్యులకు ప్రశాంతత అనేది ఉంటుంది. నిజానికి రుణం తీసుకుంటే దానికి బీమాను కూడా తీసుకోవాలని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)గానీ, ఇటు బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐగానీ చెప్పడం లేదు. అయితే మన లాభం కోసం, మన కుటుంబ సభ్యులకు రుణ భారం లేకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం ఉత్తమం.

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ అంటే?

హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను హోమ్ లోన్ ప్రొటెక్షన్ ప్లాన్ (హెచ్ఎల్‌పీపీ) అని కూడా పిలుస్తారు. ఈ స్కీమ్‌లను అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థలన్నీ అందిస్తున్నాయి. మరణం, ఆరోగ్యం పాడైపోయి, ఏదైనా కారణం చేత అవయవాలు కోల్పోయి పనిచేయలేని స్థితికి రుణగ్రహీత చేరితే రుణ చెల్లింపుల సంగతిని బీమా సంస్థే చూసుకుంటుంది.

గృహ రుణ బీమా ప్రాముఖ్యత

రుణమిచ్చే బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు.. తమ రుణాలు మొండి బకాయిలుగా మిగిలిపోవాలని చూడవు. అందుకే రుణం తీసుకునేటప్పుడే దానికి బీమా కూడా తీసుకోవాలని రుణగ్రహీతకు ఆయా సంస్థలు చెప్తాయి. దాని ప్రాధాన్యతనూ వివరిస్తాయి. పైగా ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మునుపెన్నడూ లేనివిధంగా విజృంభించిన కరోనా మహమ్మారి.. మానవుల జీవితాలను ఎంతో ప్రభావితం చేసింది. ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా ఎన్నో విధాలుగా వెనక్కినెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో రుణ బీమా మన కుటుంబాలకు రక్షగా ఉంటుంది. దురదృష్టవశాత్తు చనిపోయినా, పూర్తిగా అంగవైకల్యం బారినపడ్డా బీమా సంస్థే మన రుణ చెల్లింపుల్ని చేస్తుంది. దీనివల్ల మనం లేనిరోజున మనవాళ్లకు కనీసం సొంత ఇల్లైనా దక్కుతుంది. అలాగే ఉద్యోగం కోల్పోయినా ఆసరాగా ఉంటుంది. అయితే స్టాండర్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకోవాలి. మొక్కుబడిగా కాకుండా అన్ని ఫీచర్లున్న బీమాను కొనాలన్నది మర్చిపోవద్దు.

గుర్తుంచుకోండి..

ప్రీమియంలు

గృహ రుణ బీమా కవరేజీ ప్రీమియంను ఒకేసారి మొత్తంగా చెల్లించవచ్చు. లేదా హోమ్ లోన్ ఈఎంఐలతోపాటు నెలనెలా కొంత మొత్తాల్లోనూ చెల్లించవచ్చు.

జాయింట్ హౌజ్ లోన్

సంయుక్త గృహ రుణగ్రహీతలకూ ఈ బీమా ఉపయుక్తంగా ఉంటుంది. కో-అప్లికెంట్స్ అందరికీ ఇది వర్తిస్తుంది. అందువల్ల ఒకవేళ కుటుంబంలోని ముగ్గురు కలిసి రుణాన్ని తీసుకున్నా.. వారిలో దురదృష్టవశాత్తు ఒక్కరు అకాల మరణం పాలైనా బీమా కవరేజీని పొందవచ్చు.

రైడర్స్-యాడ్ ఆన్స్

బేసిక్ గృహ రుణ బీమాలో రుణగ్రహీత చనిపోతే చెల్లుబాటు అవుతుంది. అయినప్పటికీ రైడర్ స్కీమ్‌ను యాడ్ చేసుకోవాలంటే అదనపు ప్రీమియం చెల్లించాల్సిందే. రుణగ్రహీతకు గుండెపోటు, క్యాన్సర్, ఇతర ప్రమాదకర గాయాలపాలైనా బీమా వర్తించగలదు. అంగవైకల్యానికి గురైనా లేదా ఉద్యోగం కోల్పోయినా, ఉపాధి కరువైనా 6 నెలలదాకా ఈఎంఐ చెల్లింపులకు యాడ్ ఆన్స్ కవరేజీని ఇవ్వగలవు.

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలెన్నో..

బీమాలో రకాలు..

హైబ్రిడ్ ప్లాన్లు

హైబ్రిడ్ కవర్ ప్లాన్లలో బీమా కవరేజీ మొత్తం తొలి ఏడాది స్థిరంగా ఉంటుంది. అయితే రెండో ఏడాది నుంచి క్రమేణా కవరేజీ తగ్గిపోతూ ఉంటుంది. గృహ రుణ బకాయి మొత్తాలు కూడా తగ్గుతుండటమే దీనికి కారణం.

లెవల్ కవర్ ప్లాన్లు

గృహ రుణం కాల వ్యవధి ఎప్పటిదాకా ఉంటుందో అప్పటిదాకా ఈ లెవల్ కవర్ ప్లాన్లలో బీమా ప్రయోజనాలు స్థిరంగా ఉంటాయి. రుణ మొత్తాలు తగ్గుతున్నంత మాత్రాన బీమా కవరేజీ తగ్గిపోదు. కాబట్టి ముందే ఆలోచించి ప్లాన్లపై ఓ నిర్ణయం తీసుకోవాలి.

ప్రయోజనాలివే..

పన్ను ప్రోత్సాహకాలు

గృహ రుణగ్రహీతలు.. హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను కూడా తీసుకోవడం వల్ల పన్ను ప్రోత్సాహకాలను అందుకోవచ్చు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద బీమా కోసం చెల్లించే ప్రీమియంలను పన్ను మినహాయింపునకు కోరవచ్చు.

కుటుంబ రక్షణ

కుటుంబ పెద్ద అకాల మరణం పాలైనప్పుడు.. గృహ రుణ భారం ఆ కుటుంబ సభ్యులపై పడకుండా హోమ్ లోన్ ఇన్సూరెన్స్ కాపాడుతుంది. కాబట్టి రుణం తీసుకున్నప్పుడు దానికి బీమా కూడా తీసుకోవడం తెలివైన నిర్ణయమే అవుతుంది.

చివరగా.. ఇన్సూరెన్స్ ప్రీమియంలను రుణ మొత్తం, రీపేమెంట్ టెన్యూర్, రుణగ్రహీత వయస్సు, ఆరోగ్య పరిస్థితులు ప్రభావితం చేయగలవు. అలాగే ఎలాంటి పరిస్థితుల్లో బీమా వర్తిస్తుంది. అత్యుత్తమ బీమా కవరేజీనే తీసుకుంటున్నామా? అన్నదీ పరిశీలించుకోవాలి. క్లెయిమ్ సెటిల్మెంట్లు, పేమెంట్ పద్ధతిని కూడా కనుక్కోవడం మంచిది.

క్రెడిట్ కార్డ్ కావాలా.. నాయనా!

బ్యాంకుల్లో, పెట్రోల్ బంకుల్లో, షాపింగ్ మాల్స్‌లో క్రెడిట్ కార్డ్ కావాలా? అంటూ అడిగితే.. ఊ కొడుతూ వెళ్లే ముందు ఇదికాస్త ఆలోచించుకోండి. మీరు తీసుకునే క్రెడిట్ కార్డ్‌కు సంబంధించిన నియమ, నిబంధనలను పూర్తిగా చదవడం మర్చిపోవద్దు. దానిపై పొందే నగదు మొత్తాలకుపడే వడ్డీరేట్లు, ఇతర ఫీజులు, చార్జీలను తెలుసుకోకుంటే నష్టపోతారు. బ్యాంకింగ్ కస్టమర్ల ప్రయోజనార్థం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ మేరకు సందేశాలను కూడా ఇస్తుండటం గమనార్హం. ఇక క్రెడిట్ కార్డ్‌ను పూర్తిస్థాయిలో వాడుకోకపోవడమే మంచిది. అలాగే వాడుకున్న మొత్తాలను కొద్దికొద్దిగా చెల్లించడం కాకుండా పూర్తిగా చెల్లిస్తేనే వడ్డీభారం పడబోదని గుర్తుంచుకోవాలి.

ఒడిదొడుకులకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం వరుస లాభాల్లో కదలాడాయి. అయితే చివర్లో నష్టాలు దెబ్బతీశాయి. ఆఖరిరోజు శుక్రవారం భారీగా క్షీణించాయి. మదుపరులు ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. దీంతో ఓవరాల్‌గా గత వారం మార్కెట్లు నష్టాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఫలితంగా అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 350.77 పాయింట్లు కోల్పోయి 80,981.95 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 117.15 పాయింట్లు దిగజారి 24,717.70 దగ్గర నిలిచింది. నిజానికి గత వారం తొలిసారి సెన్సెక్స్ 82,000 మార్కును, నిఫ్టీ 25,000 మార్కును దాటాయి. ఇదిలావుంటే ఈ వారం ఒడిదొడుకులకు ఎక్కువగా ఆస్కారం కనిపిస్తున్నది. ఇజ్రాయెల్-హమాస్ నడుమ ఉద్రిక్తతల్ని మరింత పెంచేలా అమెరికా జోక్యం కలవరం పుట్టిస్తున్నది. అలాగే మదుపరులు ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో ద్వైమాసికానికిగాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించే ద్రవ్యవిధాన పరపతి సమీక్ష ఆధారంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. గురువారం ఆర్బీఐ తమ పాలసీని ప్రకటించనున్నది. సుదీర్ఘకాలంగా వడ్డీరేట్లను యథాతథంగానే సెంట్రల్ బ్యాంక్ ఉంచుతున్నది తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నది. అయితే ఇప్పటికీ ధరాఘాతం కొనసాగుతున్నది. దీంతో రాబోయే సమీక్షలో వడ్డీరేట్లపై ఆర్బీఐ ఏం నిర్ణయం తీసుకుంటుందన్నదే కీలకం. ఒకవేళ ఎప్పట్లాగే వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే సమీక్ష ముగిస్తే.. ఆటో, బ్యాంకింగ్, స్టీల్, రియల్టీ, దాని అనుబంధ రంగాల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కోవచ్చు. వడ్డీరేట్లు తగ్గితే మాత్రం ఈ రంగాల్లోని సంస్థల షేర్లన్నీ లాభాలను సంతరించుకునే వీలున్నది. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. ఇక అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,100-25,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

ఇల్లు కొంటున్నారా?

పీఎంఏవై పథకంలో వడ్డీ రాయితీ పొందండిలా



ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం మళ్లీ వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024 -25)గాను గత నెల పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో దీన్ని తిరిగి తీసుకొచ్చారు.

ఏమిటీ పీఎంఏవై?

ఈ పథకం 2015లో మొదలైంది. దేశంలోని అన్ని గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి వర్గాలకు పక్కా గృహాలు, కనీస వసతుల్ని కల్పించడమే ఈ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం లక్ష్యం. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ఇందులో పీఎంఏవై-గ్రామీణ్, పీఎంఏవై-అర్బన్ పేరిట రెండు విభాగాలున్నాయి. ఇంటి నిర్మాణం, కొనుగోలు కోసం తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీలో రాయితీ ప్రయోజనాన్ని పీఎంఏవై అందిస్తుంది.

ఎవరు అర్హులు?

- వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉన్న ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారు.
- రూ.3-6 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న అల్పాదాయ వర్గాలు.
- రూ.6-12 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న మధ్యతరగతి ప్రజానీకం.
- రూ.12-18 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న ఎగువ మధ్యతరగతి కుటుంబాలు.
- పీఎంఏవై దరఖాస్తుదారులు భారతీయులై ఉండాలి. దేశంలో మరెక్కడా వారికి సొంతిల్లు ఉండరాదు.
- కేంద్ర ప్రభుత్వం ద్వారా మరే ఇతర గృహ సంబంధిత పథకాల ప్రయోజనాలను గతంలో పొంది ఉండకూడదు.

ఇదీ సంగతి..

- నిర్ణీత వైశాల్యాల్లోని నివాసాలకే పథకం.
- మహిళలకు తక్కువ వడ్డీరేటుకే రుణాలు.
- రుణం ఎంత మొత్తమైనా తీసుకోవచ్చు. కానీ ఈ పథకం ప్రయోజనం సదరు రుణ మొత్తంలో రూ.12 లక్షల వరకే వర్తిస్తుంది.
- గరిష్ఠంగా రూ.2.67 లక్షలదాకా సబ్సిడీ.
- ఇల్లు పూర్తిగా మహిళ పేరిటగానీ, లేదా సహ యజమానిగానైనా స్త్రీలుండాలి.
- స్టాంప్ డ్యూటీ తగ్గింపు, పన్ను మినహాయింపులు, రిజిస్ట్రేషన్ చార్జీల్లో కోతలు.
- మహిళలకు రుణంపై రూ.1.5 లక్షల దాకా, వడ్డీపై రూ.2 లక్షల వరకు పన్ను మినహాయింపు. దంపతులిరువురికీ ఆదాయం ఉన్నట్టైతే ఈ ప్రయోజనం రూ.3 లక్షలు, రూ.4 లక్షలదాకా ఉండటం విశేషం.

దరఖాస్తు ఇలా..

ఆన్‌లైన్‌లోనైతే అర్హులు తొలుత పీఎంఏవై అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. ఆపై 'సిటిజన్ అసెస్‌మెంట్', 'బెనిఫిట్స్ అండర్ అదర్ 3 కాంపోనెంట్స్'లపై క్లిక్ చేయాలి. ఆ తర్వాత ఆధార్ వివరాలిస్తే దరఖాస్తు ఫారం వస్తుంది. అందులో అన్ని వివరాలను నింపితే సెక్యూరిటీ క్యాప్చా వస్తుంది. దాన్ని పూర్తిచేసి 'సేవ్' చేస్తే అప్లికేషన్ నెంబర్ వస్తుంది. దీన్ని భవిష్యత్తు అవసరాలకు రెఫరెన్స్‌గా తీసుకోవాలి. ఆఫ్‌లైన్‌లోనైతే.. ఎస్బీఐ, ఇతర పీఎంఏవై పథకం వర్తించే బ్యాంకులు, ఆర్థిక సంస్థలను సంప్రదించాలి. ఆదాయ ధ్రువీకరణ, కావాల్సిన డాక్యుమెంట్లు చూపించి ఆమోదం పొందవచ్చు. ఆపై సబ్సిడీ వడ్డీరేటుపై ఇంటి కొనుగోలు ప్రక్రియలోకి దిగవచ్చు.